

కడలూరు సభలో ఓ మహిళకు వివాహ ఆర్థిక నగదు సహాయాన్ని అందజేస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

విద్యార్థుల భవిష్యత్తును పాడు చేయొద్దు



- 'పీఎంశ్రీ' వద్దంటే రూ.5వేల కోట్లు నష్టపోతారు
- నిర్బంధ హిందీ అంటూ దుష్ప్రచారం మానండి
- సీఎం స్టాలిన్‌కు కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ లేఖ

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రతిపాదించిన కొత్త విద్యావిధానాన్ని అమలుపరిస్తేనే రాష్ట్రానికి నిధులు కేటాయించగలమంటూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పరోక్షంగా ముఖ్యమంత్రి స్టాలిన్‌కు తెలిపారు. ఈ మేరకు ఆయన ఓ లేఖ రాశారు. విద్యావ్యవస్థ, దాని భవిష్యత్తు పట్ల గౌరవభావంతో బాధ్యతతో తానీ లేఖ రాస్తున్నానన్నారు. విద్యార్థుల భవిష్యత్ రూపొందించే బాధ్యత కలిగిన నాయకులుగా, రాజకీయాలకతీతంగా విద్యార్థులకు జ్ఞానం, నైపుణ్యం, వారి భవిష్యత్తుకు ఉపాధి అవకాశాలందించే విధానాలకు ప్రాధాన్యం ఇవ్వడం చాలా ముఖ్యమని తెలిపారు. రాజకీయ కారణాలతో విద్యార్థుల భవిష్యత్ నాశనం చేయొద్దని, జాతీయ విద్యా విధానాన్ని సంకుచిత దృష్టి చూడకూదని, బీజేపీయేతర పాలిత రాష్ట్రాలు ఆ విద్యావిధానాన్ని ఆమోదించాయని ఆయన వివరించారు.

తమిళభాష నిత్యనూతనం...

జాతీయవిద్యావిధానం కేవలం సంస్కరణలు మాత్రమే కావని, దేశ విద్యా వ్యవస్థను ప్రపంచ ప్రమాణాలకు పెంచాలన్న లక్ష్యంతో రూపొందించబడిందని చెప్పారు. అదే విధంగా జాతీయ విద్యావిధానం అన్ని బాషలు, సాంస్కృతిక వైవిధ్యాన్ని పరిరక్షించి బలోపేతం చేసే దిశగా దేశాన్ని పురోగమనంలో పయనింపజేస్తుందన్నారు. మూడేళ్ల క్రితం ప్రధాని మోదీ చెన్నైలో పర్యటించినప్పుడు తమిళం నిత్యనూతనమైన భాష అనీ, తమిళ సంస్కృతి ప్రపంచ ప్రఖ్యాతి గాంచినదని, ఆ భాషను, సంస్కృతిని కాపాడేందుకు పాటుపడతామంటూ ప్రకటించారని, ఆ తర్వాత కాశీ, సౌరాష్ట్ర తమిళ సంఘాల ఏర్పాటుకు దోహదం చేశారని, ఇవన్నీ గుర్తుంకోవలసిన విషయాలని తెలిపారు. అంతే కాకుండా తిరుక్కురళ్‌ను 13 భారతీయభాషల్లో అనువదింపజేసి ఆ సూక్తులకు అంతర్జాతీయ ఖ్యాతిని కలిగించారని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి విశ్వవిద్యాలయాలలో భారతియార్ పేరిట ప్రత్యేక పీఠాలను ఏర్పాటు చేయడానికి కూడా కేంద్రం చర్యలు తీసుకుందన్నారు. జాతీయవిద్యావిధానం ప్రతి విద్యార్థికి అతడి మాతృభాషలో నాణ్యమైన విద్య లభింపజేసేందుకు దోహదపడుతుందన్నారు.

రాజకీయాలు వద్దు...

విద్యారంగంలో రాజకీయాలను చొప్పించవద్దని, రాష్ట్ర విద్యా పరిస్థితులకనుగుణంగా మార్పులు చేసేందుకే జాతీయ విద్యా విధానాన్ని రూపొందించినట్లు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. తమిళనాడు సామాజిక, విద్యాభివృద్ధిలో పురోగమిస్తోందని అంటూ జాతీయవిద్యావిధానాన్ని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ధర్మేంద్ర ప్రధాన్ ఓ వీడియో సందేశాన్ని కూడా సోషల్ మీడియాలో విడుదల చేశారు. ఆ వీడియోలో తమిళనాడు ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని అంగీకరించకుంటే రూ.5వేల కోట్లు నష్టపోతుందని తెలిపారు. విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన విద్యావిధానాన్ని తిరస్కరించడం భావ్యం కాదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు రాష్ట్రంలో నిర్బంధంగా హిందీ అమలు చేయబోతున్నారంటూ ప్రచారం చేయకూడదని, జాతీయ విద్యా విధానాన్ని ఆమోదించిన రాష్ట్రాలకు కేంద్ర నుంచి పూర్తిగా నిధులు అందుతాయన్నారు. త్రిభాషా విద్యావిధానాన్ని ఆమోదించే ప్రసక్తే లేదంటూ సీఎం స్టాలిన్ ప్రధాని మోదీకి లేఖ రాయడం ఫెడరల్ రాజ్యాంగ విధానానికి వ్యతిరేకమని, జాతీయ విద్యావిధానం అట్టడుగు వర్గాలకు చెందిన పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే పరిస్థితి కల్పిస్తుందన్నారు. తాను తెలిపిన అంశాలను పరిశీలించిన మీదట జాతీయ విద్యావిధానాన్ని అంగీకరించాలని స్టాలిన్‌కు ఆయన హితవు పలికారు.

28నచెన్నైకి మంత్రి ధర్మేంద్ర ..

ఇదిలా ఉండగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ నెల 28న నగరానికి రానున్నారు. ఐఐటీ మద్రాస్‌లో 'ఇన్నోవేటివ్ 2025' పేరుతో జరిగే సదస్సును ఆయన ప్రారంభించనున్నారు. ఈ సదస్సులో 250కి పైగా కంపెనీల ప్రతినిధులు, వందకు పైగా స్టార్ట్ అప్ సంస్థల ప్రతినిధులు పాల్గొనున్నారని ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ కామకోడి తెలిపారు.

నల్లజెండాలతో కాంగ్రెస్ స్వాగతం

జాతీయ విద్యావిధానాన్ని అమలు చేస్తేనే సర్వ శిక్షా అభియాన్ పథకం నిధులు రూ 2152 కోట్లు విడుదల చేస్తామంటూ రాష్ట్రాన్ని బ్లాక్ మెయిల్ చేసేలా బెదరిస్తున్న కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తీరును ఖండిస్తూ ఈ నెల 28న ఆయనకు నల్లజెండాలతో స్వాగతం పలకనున్నట్లు టీఎన్‌సీసీ నేత సెల్వపెరుంతగై శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

మా పిల్లల చదువులను అడ్డుకుంటారా?

- పెండింగ్ నిధులడిగితే బెదిరిస్తారా?
- కడలూరు సభలో కేంద్రంపై సీఎం స్టాలిన్ ఆగ్రహం

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): 'జాతీయ విద్యావిధానం పేరుతో మా పిల్లల చదువులను అడ్డుకుంటారా? ఇవ్వాల్సిన నిధులడిగితే బెదిరిస్తారా? ప్రజల కోసం మేం ఖర్చుపెడుతుంటే, మీరు మతంకోసం, సంస్కృతం, హిందీ భాష నిర్బంధంగా అమలు చేయడం కోసం ఖర్చు పెడుతున్నారు.. కేంద్రానికి మా దగ్గర నుంచి నిధులివ్వలేమని చెప్పడానికి మాకు ఒక్క క్షణం చాలనే విషయాన్ని మరిచిపోకండి' అంటూ డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ కేంద్ర ప్రభుత్వంపై, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌పై విరుచుకుపడ్డారు. కడలూరు జిల్లా మంజకుప్పం మైదానంలో శుక్రవారం సాయంత్రం ప్రభుత్వ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆ జిల్లాలో రూ.1476.22కోట్లతో పూర్తయిన 602 పథకాలను ప్రారంభించి, కొత్తగా 178 పథకాలకు శంకుస్థాపన చేశారు. వివిధ సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు సహాయాలు పంపిణీ చేశారు. ఆ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ విద్యతో రాజకీయాలు చేయవద్దని రాష్ట్రానికి హితవు పలుకుతుండటం గర్హనీయమని, విద్యను రాజకీయం చేసేదీ బీజేపీ పాలకులేనని, త్రిభాషా విద్యావిధానాన్ని అంగీకరిస్తేనే విద్యారంగానికి నిధులిస్తామని బెదిరించడం రాజకీయం కాక మరేమిటని ప్రశ్నించారు. విభిన్న భాషలు కలిగిన దేశాన్ని ఏక భాషతో కూడిన దేశంగా మార్చేందుకు ప్రయత్నించడం రాజకీయం కాదా అని మంత్రి. ధర్మేంద్ర ప్రధాన్‌పై ధ్వజమెత్తారు. ఓ పథకం అమలుకు విడుదల చేయాల్సి నిధులను మరో పథకం అమలుకోసం నిలిపివేయడం అసలుసిసలు రాజకీయం కాదా అని స్టాలిన్ ప్రశ్నించారు. కేంద్ర రాష్ట్రాల మధ్య నిధుల విషయంలో ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉంటేనే అది ప్రజాస్వామ్యం అవుతుందని ఈ విషయం కూడా తెలియని వ్యక్తులు దేశాన్ని పాలించడం భారతీయులకు శాపం అని విమర్శించారు. రాష్ట్రంలో మాతృభాషను పెంచనున్నట్లు మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చెప్పడం వింతల్లోకెల్లా వింత అని, మాతృభాషను తాము ఎలా పెంచి పోషిస్తున్నామో ఈ జగమంతా తెలుసన్నారు. తేనె తుట్టెపై రాళ్లు విసిరే ధోరణి మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నానని, తమిళుల అసలు సిసలు గుణాల ఏమిటోచూడాలని ఆశపడవద్దని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కేఎన్ నెహ్రూ, పొన్ముడి, ఎంఆర్కే పన్నీర్‌సెల్వం, ఎస్ఎస్ శివశంకర్, వీసీ గణేశన్, ఎంపీ విష్ణుప్రసాద్, శాసనసభ్యులు జి. అయ్యప్పన్, సభా రాజేంద్రన్, వేల్‌మురుగన్, రాధాకృష్ణన్, సింథనైసెల్వన్, కడలూరు జిల్లా కలెక్టర్ సిపీ ఆదిత్యా సెంథిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రితో సెల్ఫీ తీసుకుంటున్న యువతీ యువకులు

అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని ప్రజలే ఇంటికి సాగనంపుతారు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై



ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అవినీతి డీఎంకే ప్రభుత్వాన్ని ప్రజలే ఇంటికి సాగనంపుతారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జ్యోష్యం చెప్పారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి బాగా పెరిగిందని, మరోవైపు శాంతిభద్రతలు క్షీణిచాఆయని, డీఎంకే ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. హిందీ భాషను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో నిర్వహించిన ఉద్యమంలో పాల్గొన్న 15 మంది తమిళులు ప్రాణత్యాగం చేశారని అయితే, వీరి కుటుంబాల్లోని ఒక్కరికి కూడా డీఎంకేలో గానీ, ప్రభుత్వంలో నామినేటెడ్ ఎదవులు కట్టబెట్టలేదని, కేవలం ఒకే కుటుంబం మాత్రమే ఆధిక్యం చెల్లిస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. దేశాన్ని అభివృద్ధి బాటలోకి నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీని 'గెటౌట్ మోదీ' అని సంబోధించే వారిని ప్రజలు రాజకీయాల నుంచి వెలివేస్తారన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో డీఎంకే భాగస్వామ్యం వహించిందని, అప్పుడు రాష్ట్రానికి రూ.8,053 కోట్లు మాత్రమే కేటాయించారని, ఈ వాస్తవం తెలియక డీఎంకే సహా మిత్రపక్షాలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నామలై అన్నారు.

కేంద్రం వైఖరిని ఖండిస్తూ 25న డీఎంకే విద్యార్థి విభాగం ఆందోళన

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): త్రిభాషా విద్యావిధానం అమలు చేస్తేనే నిధులిస్తామంటూ బ్లాక్‌మెయిల్ ధోరణిని ప్రదర్శిస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ ఈ నెల 25 రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు జరపాలని డీఎంకే విద్యార్థి విభాగం నిర్ణయించింది. ఆ విభాగం సమావేశం తేనాంపేటలోని డీఎంకే ప్రధాన కార్యాలయం అన్నా అరివాలయంలో శుక్రవారం జరిగింది. ఈ సమావేశానికి డీఎంకే విద్యార్థి విభాగం కార్యదర్శి, శాసన సభ్యుడు ఎళిలరసన్ అధ్యక్షత వహించారు. డిప్యూటీ కార్యదర్శులు సి. జెరాల్డ్, ఎస్ మోహన్, సహాయ కార్యదర్శులు సేలం ఇరా తమిళరసన్, అదలై పి. సెంథిల్‌కుమార్, కే అముదరసన్, పీఎం ఆనంద్, వీజీ గోకుల్, పూర్ణ సంగీత, జే వీరమణి, జే రామకృష్ణన్ తదితరులు పాల్గొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం త్రిభాషా విద్యావిధానం పేరుతో రాష్ట్రంలో నిర్బంధ హిందీ అమలు చేయడానికి కుట్రపన్నుతుండటంతో తమిళ భాషను కాపాడుకునేందుకు మరో భాషోద్యమానికి విద్యార్థి విభాగాలు సిద్ధం కావాలని పిలుపునిస్తూ తీర్మానం చేశారు. మతం



అరివాలయంలో డీఎంకే విద్యార్థి విభాగ సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఎళిలరసన్

కేంద్ర మంత్రి క్షమాపణలు చెప్పాలి...

త్రిభాషా విద్యావిధాన్ని అమలు చేస్తేనే నిధులిస్తామంటూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బ్లాక్‌మెయిల్ ధోరణిలో చేసిన బెదిరింపును ఖండిస్తూ మరో తీర్మానం చేశారు. మంత్రి రాష్ట్ర ప్రజలకు బహిరంగంగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోనే ఇనుప యుగం ప్రారంభమైనట్లు పురావస్తు తవ్వకాల ద్వారా లోకానికి ఎలుగెత్తి చాటిన ముఖ్యమంత్రి స్టాలిన్‌ను ప్రశంసిస్తూ ఐదో తీర్మానం చేశారు. మార్చి 1న పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జన్మదిన వేడుకలను యువకుల ఉత్తేజ దినంగా జరుపుకోవాలని కూడా ఓ తీర్మానం చేశారు.

పేద పిల్లలను కూలీలుగా మార్చడమే నూతన విద్యావిధాన ఆశయం

- స్పీకర్ అప్పావు విమర్శ

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యావిధానం పేద పిల్లలకు విద్యను దూరం చేసి, వారిని కూలీలుగా మార్చుతుందని శాసనసభ స్పీకర్ అప్పావు విమర్శించారు. నగరంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్టాలిన్ నూతన విద్యావిధానాన్ని రాజకీయ అంశంగా మార్చలేదని, అందరికీ విద్యనందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి కుంటి సాకులతో కేంద్ర నిధులను నిలిపివేయడం భావ్యమేనా అని ప్రశ్నిస్తున్నారని అప్పావు చెప్పారు. 2022లో కేంద్రం ప్రతిపాదించిన నూతన విద్యావిధానాన్ని అమలు చేసిన బిహార్ రాష్ట్రంలో ప్రస్తుతమున్న విద్యా పరిస్థితి పరిశీలిస్తే ఆ విద్యావిధానం ఎంతటి నష్టం కలిగిస్తుందో తెలుసుకోవచ్చునని చెప్పారు. ఆ రాష్ట్రంలో నూతన విద్యావిధానం అమలు చేసిన తర్వాత పాఠశాలలకు వచ్చే విద్యార్థులు సంఖ్య 51 శాతం నుండి 31 శాతానికి పడిపోయిందని, రెండేళ్లకే ఈ పరిస్థితి ఎదురైతే మరికొన్ని సంవత్సరాలు గడిస్తే ఆ రాష్ట్రంలోని పాఠశాలలో విద్యార్థులు లేకుండా నడపాల్సి వస్తుందని అప్పావు వివరించారు. డీఎంకే ప్రభుత్వం ఏ భాషకు వ్యతిరేకం కాదని, అన్ని భాషాలు నేర్చుకోవచ్చనే చెబుతోందని, అదే సమయంలో ఏ భాషనైనా నిర్బంధంగా అమలు చేయడానికి అంగీకరించదని, ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం దొడ్డిదారిన హిందీ అమలు చేయడానికి ప్రయత్నించడం గర్హనీయమన్నారు. నూతన విద్యావిధానం అమలు చేయాలని కేంద్రం పట్టుబడుతోందన్న విషయం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసునని, హిందీకి వ్యతిరేకంగా మరోమారు తీవ్రమైన ఉద్యమాన్ని జరిపేందుకు కూడా సిద్ధమవుతున్నారని స్పీకర్ అప్పావు పేర్కొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న స్పీకర్ అప్పావు

మాతృభాషకోసం సమష్టి పోరాటం

- మద్రాసు వర్సిటీ తెలుగుశాఖ చర్చావేదికలో వక్తలు

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృ భాష పరిరక్షణ కోసం నగరంలోని తెలుగు సంస్థలన్నీ సమైక్యంగా పోరాడాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు అంతర్జాతీయ మాతృభాషాదినోత్సవం సందర్భంగా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆధ్వర్యంలో 'మాతృభాష పరిరక్షణ - సూచనలు' అనే అంశంపై శుక్రవారం చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన తెలుగు శాఖ అధ్యక్షుడు ఆచార్య విస్తాలి శంకరరావు మాతృ భాష పరిరక్షణలో తెలుగుశాఖ అనుసరిస్తున్న విధానాలను వివరించారు. ఆచార్య ఎల్బీ శంకరరావు తెలుగు భాష తీరుతెన్నులు, పలుకులు, నానుడి, ఇతర భాషల ప్రభావం తదితర అంశాలను వివరించారు. డాక్టర్ తిరుమల ఆముక్త మాల్యద మాతృభాష ఔన్నత్యం, కవుల ప్రయోగాలు, భాషా పరిరక్షణకు చేపట్టాల్సిన సూచన చేశారు.. ఇదే విధంగా గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ ఎన్.ఎలిజబెత్ జయకుమారి, డాక్టర్ దయామణి, ఎల్బీ సుజాతమ్మ, డాక్టర్ టీఆర్ఎస్ శర్మ, వంజరపు శివయ్య, నాగేశ్వరరావు, నిడమర్తి వసుంధరా దేవి, డాక్టర్ పాండురంగం కాళియప్ప, డాక్టర్ మాదా శంకరబాబు తదితరులు పాల్గొన్నారు.



చర్చావేదికలో ఆచార్య విస్తాలి శంకరరావు, ఆచార్య ఎల్బీ శంకరరావు, టీఆర్ఎస్ శర్మ తదితరులు

సమాచార దృశ్యిని

నేడు శ్రీకృష్ణ రథయాత్ర

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): హరే కృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నగరంలో 14వ వార్షిక రథయాత్ర శనివారం జరుగనుంది. బీసెంట్ నగర్ బీచ్ నుంచి సాయంత్రం 5.30 గంటలకు ప్రారంభమయ్యే రథయాత్ర మహాత్మాగాంధీ రోడ్డు, ఇందిరా నగర్, తిరువాన్మియూర్ మార్గంగా రాత్రి 9 గంటలకు తిరువాన్మియూర్ వాల్మీకి నగర్‌లోని దక్షిణ ద్వారకా ధామ్ వరకు కొనసాగనుంది. రథయాత్ర వెంబడి కోలాటం, ఒయిలాట్టం, గరగాట్టం, నెమిలి ఆట్టం, పులి ఆట్టం సహా పలు ప్రదర్శనలుంటాయి. ఈ యాత్రలో 500 మంది భక్తులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు సభ్యుల నియామకం

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఉపాధ్యక్షులు, సభ్యుల మూడేళ్ల కాలం ఇటీవల ముగిసింది. మాజీ న్యాయమూర్తి తమిళ్‌వానన్ అధ్యక్షులుగా, రేఖా ప్రియదర్శిని సభ్యులుగా ఉన్నారు. ఖాళీ పదవులు భర్తీ చేసేలా ఉపాధ్యక్షులుగా ఇమయం, సభ్యులుగా సెల్వకుమార్, ఆనందరాజా, పొంటోస్, ఇలంచెళియన్ తదితరులను నియమిస్తూ ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి లక్ష్మీప్రియ ఉత్తర్వులు జారీచేశారు.

మెట్రో స్టేషన్లలో కమర్షియల్ ప్లేస్

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ప్రయాణికుల ఆదాయమే కాకుండా పలు మార్గాల్లో ఆదాయం సమకూర్చుకొనేలా చర్యలు చేపడుతోంది.ఆ ప్రకారం, సెంట్రల్, ఎగ్మూర్, వడపళని, నందనం, సైదాపేట, డీఎంఎస్, థౌజండ్ లైట్స్‌ఐ, సెయింట్ థామస్ మౌంట్ సహా 20 మెట్రో రైల్వేస్టేషన్లలో వాణిజ్య అవసరాలకు స్థలం కేటాయించనున్నారు. ఆసక్తి కలిగిన వ్యాపారులు chennaimetrorail.org/businessdevelopment/retailspaces అనే వెబ్‌సైట్‌లో మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని సీఎంఆర్ఎల్ తెలిపింది.

పళని ఆలయంలో తనిఖీలు

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లాలోని పళని దండాయుధపాణి ఆలయ కార్యాలయంలో అవినీతి నిరోధక విభాగం అధికారులు శుక్రవారం ఉదయం ఆకస్మికతనిఖీలు నిర్వహించారు. ఈ ఆలయ ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న అధికారులు లంచం డిమాండ్ చేస్తున్నారనే సమాచారం మేరకు, డీఎస్పీ నాగరాజ్ నేతృత్వంలో పదిమంది ఏబీసీ అధికారులు సుమారు మూడు గంటల పాటు తనిఖీ చేయడంతో ఆలయ సిబ్బందికి ఆందోళనకు గురిచేసింది.

'స్మార్ట్' మీటర్ల కొనుగోలుకు ఆమోదం

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఇళ్లల్లో 'స్మార్ట్' మీటరు పథకాన్ని విద్యుత్ బోర్డు అమలుచేస్తోంది. ఇందుకోసం, 3 కోట్ల స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేసి, 10 ఏళ్ల నిర్వహించేలా ఒప్పంద సంస్థ ఎంపికకు 2023లో టెంటర్లు ఆహ్వానించింది. కానీ, ఆ టెండర్లను ఇటీవల రద్దు చేశారు. ఈ నేపథ్యంలో, నగరంలోని విద్యుత్ బోర్డు ప్రధాన కార్యాలయంలో గురువారం విద్యుత్ బోర్డు డైరెక్టర్ల సమావేశం జరిగింది. అందులో, స్మార్ట్ మీటర్ల కొనుగోలకు మళ్లీ టెండర్ల ఆహ్వానం సహా పలు పనులకు ఆమోదం తెలిపారు. ఆ ప్రకారం, స్మార్ట్ మీటర్ల కొనుగోలుకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నట్లు అధికారులు తెలిపారు.

15లోగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

● ఈబీ ఉత్తర్వులు

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మార్చి 15వ తేదిలోగా ఇవ్వాలని విద్యుత్ బోర్డు ఆదేశించింది. 2024-25వ ఆర్థిక సంవత్సరానికి 15,000 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించగా, ప్రస్తుతం 11,551 కనెక్షన్లు మాత్రమే పూర్తయ్యాయి. ఈ క్రమంలో, మిగిలిన కనెక్షన్లు మార్చి 15వ తేదిలోగా పూర్తి చేయాలని ఇంజనీర్లకు విద్యుత్ బోర్డు ఉత్తర్వులు జారీచేసింది.

రేషన్ ఉద్యోగులకు ప్రత్యేక యూనిఫాం

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రేషన్ దుకాణాల్లో పనిచేస్తున్న 4,710 మంది ఉద్యోగులకు ప్రత్యేక యూనిఫాం అందించాలని ఆహార శాఖ నిర్ణయించింది. వినియోగదారులు సులభంగా గుర్తించేలా, రాష్ట్రవ్యాప్తంగా ఆహార శాఖ నిర్వహిస్తున్న రేషన్ దుకాణాల్లో పనిచేసే ఉద్యోగులక రెండు జతల యూనిఫాం ఇవ్వనున్నారు. ఆ ప్రకారం సచివాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆ శాఖ మంత్రి చక్రపాణి, కార్యదర్శి సత్యప్రదసాహు పాల్గొని, పది మంది ఉద్యోగులకు యూనిఫాం అందజేశారు. ఈ నెలాఖరులోగాఉద్యోగులందరికి యూనిఫాం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

నేడు ప్లాస్టిక్ నిర్మూలన మారథాన్

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కాలుష్య నియంత్రణ బోర్డు, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) ప్లాస్టిక్ వినియోగం తగ్గించేలా అవగాహన మారథాన్ నిర్వహించనున్నాయి. ఐలాంగ్ గ్రౌండ్స్‌లో ఉదయం జరిగే ఈ మారథాన్‌లో విద్యార్థులు, అధికారులు, రాజకీయ నేతలు పాల్గొననున్నారు. కార్యక్రమంలో భాగంగా రాయపురం, తేనాంపేట, అడయార్ మండలాల్లోని ప్రార్థనా స్థలాల మార్గాల్లో ప్లాస్టిక్ వస్తువులు తొలగించే కార్యక్రమం చేపట్టనున్నట్లు జీసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

20 యేళ్లు లేటుగా వచ్చా... అదే నా తొలి ఓటమి!

ఈ యేడాది పార్లమెంట్‌లో పార్టీకి స్థానం ● ఎంఎన్ఎం వార్షికోత్సవ సభలో కమల్

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రెండు దశాబ్దాలకు ముందే రాజకీయ ప్రవేశం చేసి ఉంటే తానెంతో ఉన్నత స్థితిలో ఉండేవాడినని, ఆ సమయంలో వెనుకంజ వేయటమే తన మొదటి ఓటమి అని మక్కల్ నీదిమయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు, సినీనటుడు కమల్‌హాసన్ అన్నారు. పార్టీ ఎనిమిదో వార్షికోత్సవం శుక్రవారం ఆళ్వార్‌పేటలోని పార్టీ కార్యాలయంలో జరిగింది. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన రాజకీయ పయనంలో అభిమానులు వేరు, ఓటర్లు వేరు అని గ్రహించగలిగానని, చివరి ఓటరు ఉన్నంతవరకూ తమ పార్టీ సేవలు కొనసాగిస్తానన్నారు. ఇరవై ఏళ్ల క్రితం తాను రాజకీయ ప్రవేశం చేసి ఉండాలని, అప్పట్లో తగు నిర్ణయం తీసుకుని ఉంటే తాను రాజకీయాల్లో ఉన్నతస్థితిలో ఉండేవాడినన్నారు. రాష్ట్ర ప్రజలందరినీ సమైక్యపరిచేది తమిళ భాషేనని, తాను ఆత్మవిశ్వాసంతో ముందుకు దూసుకుపోతుండటానికి కారణం తమిళ ప్రజలేనని చెప్పారు. ఆకాశమంత ఎత్తుకు ఎదిగిన తమిళభాషను ఎవరూ కిందకు దించలేరని ఆయన చెప్పారు. ఈ యేడాది పార్లమెంట్‌లో పార్టీ వాణి తొలిసారిగా వినిపిస్తుందని, వచ్చే యేడాది రాష్ట్ర అసెంబ్లీలో పార్టీ సభ్యులుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులంతా ప్రజలకు తోచినంత సేవ చేస్తూ ఉండాలని, అప్పుడే పార్టీకి బంగారు భవిష్యత్తు ఉంటుందని కమల్ పేర్కొన్నారు.



పార్టీ వార్షికోత్సవంలో ప్రసంగిస్తున్న కమల్‌హాసన్

నెల తిరక్కమునుపే జిల్లా నేతలపై చర్యలు

● టీవీకే ఆదవ్ అర్జునకు కొత్త బాధ్యతలు



విజయ్, ఆదవ్‌అర్జున

చెన్నై, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రికళగం ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా నియమితులైన జల్లా కార్యదర్శులపై నెల రోజుల్లోనే ఆరోపణలు రావటంతో వారిపై క్రమశిక్షణా చర్యలు చేపట్టేందుకు ఆ పార్టీ నేత, నటుడు విజయ్ సిద్ధమవుతున్నారు. ఆరోపణలు వచ్చిన జిల్లా కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని ఇటీవలే పార్టీలో చేరిన ఆదవ్ అర్జున్‌కు అప్పగించారు. పార్టీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయ్ జిల్లా శాఖ నాయకులను నియమించారు. వీరందరిని వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలకు ఇప్పటి నుండే ప్రచారం చేయాలని, జిల్లా , నగరస్థాయిలో పార్టీని బలపరిచేందుకు కూడా పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. వీరి నియామకాలు జరిగి నెల రోజులు కూడా కాకముందే కొందరు జిల్లా కార్యదర్శులు నగర, పట్టణ స్థాయి పదవులను అమ్ముకుంటున్నారని ఆరోపణలు వచ్చాయి. మరికొంతమంది జిల్లా శాఖ నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి అధికారంలో ఉన్నట్లుగా పార్టీ శ్రేణులతో వ్యవహరిస్తున్నారని గుర్తించారు. ఇంకొంతమంది ఇంటిపట్టునే ఉంటున్నారని తెలుసుకున్నారు. ఇలా సుమారు 20 శాతానికి పైగా జిల్లాశాఖ కార్యదర్శులపై ఆరోపణలు రావటంతో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విజయ్ నిర్ణయించారు.ఈవ్యవహారంపై దృష్టిసారించి చర్యలు చేపట్టే బాధ్యతలను ఆదవ్ అర్జునాకు ఆయన అప్పగించారు. దీంతో యేళ్ల తరబడి విజయ్ అభిమాన సంఘాల నాయకులుగా ఉంటూ ఇటీవల జిల్లా శాఖ పదవులు పొందిన పలువురు తమపై ఆదవ్ అర్జునా కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలుసుకుని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో ఆదవ్ అర్జునా జిల్లా స్థాయిలో పార్టీని అభివృద్ధి పరిచేదిశగా ఆరోపణలకు గురైన నేతలను తొలగించి కొత్తవారిని నియమించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే పనిచేయని జిల్లా నేతల తొలగింపుల పర్వం ప్రారంభమవుతుందని తమిళగ వెట్రి కళగం నేతలు చెబుతున్నారు.

15 మంది తమిళ జాలర్ల విడుదల

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైలులో బందీలుగా ఉన్న 15 మంది తమిళ జాలర్లు విడుదలయ్యారు. శ్రీలంక రాజధాని కొలంబో నుంచి గురువారం రాత్రి విమానంలో వారు చెన్నై చేరుకున్నారు. రామనాథపురం జిల్లా రామేశ్వరం ఫిషింగ్ హార్బర్ నుంచి సముద్రంలో చేపల వేటకు వెళ్లిన 19 మంది తమిళ జాలర్లను జనవరి 26న శ్రీలంక నావికాదళం, సముద్ర సరిహద్దులు దాటారనే కారణంగా అరెస్ట్ చేసింది. ఈ నెల 5వ తేది ఈ కేసు విచారణకు రాగా, 19 మంది జాలర్లలో 16 మందికి శ్రీలంక న్యాయస్థానం తలా రూ.50 వేలు జరిమానా, ఓ పడవ యజమాని రోబిల్లన్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. ఈ నేపథ్యంలో, న్యాయస్థానంలో జరిమానా చెల్లించిన 15 మంది తమిళ జాలర్లను కిలినొచ్చి న్యాయస్థానం విడుదల చేసింది. రాష్ట్రానికి తిరిగొచ్చిన వీరిని మత్స్యశాఖ అధికారులు ఆహ్వానించి ప్రభుత్వ వాహనాల ద్వారా శుక్రవారం ఉదయం రామేశ్వరానికి సాగనంపారు.



విడుదలైన జాలర్లు

మృతిచెందిన విద్యార్థుల కుటుంబాలకు సీఎం ఆర్థికసాయం

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం మూనారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కళాశాల విద్యార్థుల కుటుంబాలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆర్థికసాయం ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో... కన్నియాకుమారి జిల్లా అగస్తీశ్వరం తాలూకా నీండకరై తూర్పు గ్రామంలోని ఓ కళాశాలకు చెందిన 39 మంది విద్యార్థులు, ముగ్గురు ప్రొఫెసర్లు కేరళ రాష్ట్రానికి విహారయాత్రకు వెళ్లారు. వారు వెళ్లిన బస్సు ఈ నెల 19న ప్రమాదానికి గురైన ఘటనలో అతిక (20), వేనిక (20) సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, నిత్యానందన్ (20) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలిచి వేసిందని, మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపడంతో పాటు వారికి తలా రూ.3 లక్షలు, ఈ ఘటనలో గాయపడి మదురై ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి తలా రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు సీఎం ప్రకటించారు. అలాగే, గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆస్పత్రి నిర్వాహకులను సీఎం ఆదేశించారు.

అంబులెన్స్‌కు అడ్డంగా అడవి ఏనుగు

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు జిల్లా వాల్పారై పడమటి కనుమలకు చేరువగా ఉన్న రహదారుల్లో అడవి ఏనుగుల సంచారం అధికమైంది. ప్రస్తుతం అటవీ ప్రాంతాల్లో నీటి కొరత ఏర్పడటంతో తాగునీటి కోసం ఏనుగులు రహదారులలో సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆళియార్ - వాల్పారై రహదారిలో చిన్నార్‌పది సమీపంలో ఓ అడవి ఏనుగు సంచరిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించసాగింది. పొల్లాచ్చి నుండి ఓ రోగిని తీసుకుని వాల్పారై వైపు బయలుదేరిన ఓ అంబులెన్స్‌ను ఏనుగు అడ్డుకుంది. సుమారు అరగంటసేపు అంబులెన్స్ వెళ్ళకుండా అడ్డుకున్న ఏనుగు చివరకు పొదలమాటుకు వెళ్ళింది. ఈ మార్గంలో అడవి ఏనుగులు సంచరించకుండా అటవీ శాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు విజ్ఞప్తి చేస్తున్నారు.



వాల్పారై రహదారిలో అంబులెన్స్‌కు దారివ్వకుండా నిలిచిన ఏనుగు

రాష్ట్రానికి ప్రధాని సహా కేంద్ర మంత్రుల రాక

● భారీ భద్రతా ఏర్పాట్లు

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఈ నెల 26,28 తేదీల్లో జరిగే వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ పాల్గొననున్న నేపథ్యంలో, రాష్ట్ర పోలీసు శాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. కోట్టూరుపురంలోని చెన్నై ఐఐటీలో ఈ నెల 28న జరుగనున్న కార్యక్రమానికి కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రానున్నారు. అదే విధంగా 26వ తేది కోవైలో ఉన్న ఈషా యోగా కేంద్రంలో జరిగే మహాశివరాత్రి వేడుకల్లో పాల్గొనేందుకు హోం శాఖ మంత్రి అమిత్ షా రానున్నట్లు సమాచారం. అలాగే, ప్రధాని నరేంద్ర మోదీ రామనాథపురం జిల్లా రామేశ్వరంలో కొత్తగా నిర్మించిన పాంబన్ వంతెన ప్రారంభోత్సవానికి ఈ నెల 28న రానున్నట్లు సమాచారం. అదే సమయంలో రాష్ట్రానికి నిధులు కేటాయించని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ అధికార డీఎంకే సహా ప్రతిపక్ష పార్టీలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అంతేకాకుండా, రాష్ట్రానికి విచ్చేయనున్న కేంద్ర మంత్రులకు నల్లజెండాలతో నిరసన తెలుపనున్నట్లు ప్రకటించాయి. అందువల్ల రాష్ట్ర పోలీసు శాఖ కేంద్ర మంత్రులు, ప్రధాని భద్రతను కట్టుదిట్టం చేసింది.

కాలికి కడియంతో వస్తున్న వలస పక్షులు



చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో వారం రోజులుగా విదేశీ పక్షుల రాక అధికమైంది. వన్యప్రేమికులు కాలికి కట్టిన కడియాలతో ఈ విదేశీ పక్షులు ఆ ప్రాంతంలో వాలుతున్నాయి. వివిధ దేశాలకు వలస వెళ్లే పక్షులు ఏ దిశగా ఏయే ప్రాంతాలకు వెళుతున్నాయనే విషయం తెలుసుకునేందుకు పక్షి ప్రేమికులు వాటి కాళ్లకు కడియాలు కడుతుంటారు. ఆ కడియాలపై ఆ పక్షుల స్వస్థలం వివరాలుంటాయి. ఆ కడియాల ద్వారానే ఆ పక్షులు వలస వెళ్ళిన ప్రాంతాల వివరాలను పక్షుల ప్రేమికులు సేకరిస్తున్నారు. ప్రతియేటా కొడైకెనాల్‌లో వేసవి ప్రారంభానికి ముందే వివిధ రకాల రంగురంగుల పక్షులు వస్తుంటాయి. ప్రస్తుతం కాలికి కడియాలున్న విదేశీ విహంగాలు వందల సంఖ్యలో కొడైకెనాల్ పర్వతశ్రేణుల్లో వాలుతున్నాయి. ఆ పాంతం అంతటా పర్యాటకులకు రమ్యమైన వాతావరణమే కనిపిస్తోంది.



చెన్నై నగరంలో సీబీఎస్‌ఈ ప్లస్‌టు పరీక్షలు రాయడానికి సిద్ధమవుతూ ఆలయంలో పూజలు చేస్తున్న విద్యార్థినులు, స్కూలు వద్ద సామూహిక ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

జిల్లాల వారీగా 'ఉత్తమ పాఠశాలలు' ఎంపిక

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ అన్బళగన్ పురస్కారాలకు జిల్లాల వారీగా 'ఉత్తమ పాఠశాలలు' ఎంపిక చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. బోధన, శుభ్రత, పర్యావరణ పరిరక్షణ సహా పలు కార్యక్రమాలు చేస్తున్న పాఠశాలలను ఎంపిక చేసి, ఆ వివరాలను ఈ నెల 27వ తేదిలోపు పంపించాలని జిల్లా ప్రధాన విద్యాధికారులకు పాఠశాల విద్యా శాఖ ఉత్తర్వులు జారీచేసింది.

చెన్నై నుంచి కశ్మీర్‌కు విమాన సేవలు ప్రారంభం

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయం నుంచి జమ్ము కశ్మీర్‌కు డైరెక్ట్ విమాన సేవలను ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ గురువారం ప్రారంభించింది. చెన్నై, శివారు ప్రాంతాల్లో ప్రస్తుతం ఎండలు మండిపోతున్న నేపథ్యంలో పర్యాటక ప్రాంతాలకు వెళ్లి సేదతీరేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రధానం గా జమ్ము కశ్మీర్‌కు వెళ్లే పర్యాటకుల కోసం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ నగరం నుంచి విమాన సేవలకు శ్రీకారం చుట్టింది. ఒకే టిక్కెట్ మీద చెన్నై నుంచి కశ్మీర్ వరకు ప్రయాణించే అవకాశం కల్పించింది.

హిందీని వ్యతిరేకిస్తూ రాష్ట్రమంతటా పోస్టర్లు



చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యావిధానం పేరుతో త్రిభాషా విద్యావిధానాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రయత్నిస్తోందంటూ డీఎంకే నాయకులు విమర్శల వర్షం కురిపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రమంతటా శుక్రవారం ఉదయం గోడలపై ప్రత్యక్షమైన పోస్టర్లు కలకలం సృష్టిస్తున్నాయి. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం రోజున పసుపురంగుతో ఉన్న ఓ రైల్వేస్టేషన్ గోడపై 'తమిళ్ వాళ్‌గ (తమిళం వర్ధిల్లాలి) అనే నినాదం, దాని దిగువనే హిందీ భాషలో ఉన్న 'హిందీ' పదాన్ని కొట్టేసినట్లు తారుపూసినట్టు పోస్టరు రూపొందించారు.. ఈ పోస్టర్ 1970లో మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి నాయకత్వంలో జరిగిన హిందీ వ్యతిరేకోద్యమంలో రైల్వేస్టేషన్లలో ఉన్న హిందీ పేర్లను తారుతో పూసిన సంఘటన తలపించేలా ఉండటం విశేషం. చెన్నై సహా పలు నగరాలలో ఈ పోస్టర్లు అతికించి ఉన్నాయి.

లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్ట్

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిషేధించిన లాటరీ టిక్కెట్లు విక్రయించిన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అన్నా స్క్వేయర్ సమీపంలో పోలీసులు గస్తీ తిరుగుతున్న సమయంలో కొందరు ఆన్‌లైన్‌లో పొరుగు రాష్ట్రాల లాటరీ టిక్కెట్లు విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో, ఆ ప్రాంతంలో తనిఖీలు ముమ్మరం చేసిన పోలీసులు, పల్లవన్ రోడ్డు గాంధీ నగర్‌కు చెందిన వీరమణి, అన్నై సత్యా నగర్‌కు చెందిన ఆనందకుమార్, పల్లవన్ రోడ్డు ఇందిరా గాంధీ నగర్‌కు చెందిన సుధాకర్‌లను అరెస్ట్ చేసి, వారినుంచి మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు గ్రేటర్ చెన్నై పోలీసు కార్యాలయం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది.

మహిళను బెదిరించి సామూహిక అత్యాచారం

● తుపాకితో కాల్చి నిందితుల పట్టివేత

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణగిరిలో పోలీసులపై దాడి చేసి తప్పించుకుపోయిన నిందితులపై పోలీసులు కాల్పులు జరిపి అదుపులోకి తీసుకున్నారు. కృష్ణగిరి కొండ ప్రాంతంలో నలుగురు యువకులు మద్యం మత్తులో కూలి పనులను వెళ్లిన మహిళను బెదిరించి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేసి, పరారీలో ఉన్న మరో ఇద్దరు కోసం గాలిస్తున్నారు. ఈ నేపథ్యంలో, శుక్రవారం ఉదయం పరారైన ఇద్దరు యువకులు పాన్‌మలైకోట పెరుమాళ్ ఆలయం వెనుక వైపు దాగి ఉన్నారనే సమాచారంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని వారిని చుట్టుముట్టారు. దీంతో, వారు దాడిచేయడంతో ఇద్దరు పోలీసులకు గాయాలయ్యాయి. అంతలో తప్పించుకొనేందుకు యత్నించిన నిందితులు సురేష్, నారాయణపై పోలీసులు కాల్పులు జరుపగా, వారి కాళ్లకు బుల్లెట్ గాయాలై కిందపడిపోయారు. దీంతో, ఇద్దరి అరెస్ట్ చేసిన పోలీసులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కరూర్ సమీపంలో విద్యుత్ మోటారుకు మరమ్మతులు చేపట్టిన ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతంతో మృత్యువాతపడ్డారు. కె.పరమత్తి సమీపం క్రాసర్‌మేడు ప్రాంతంలోని ప్రభుత్వ పోరంబోకు స్థలంలోని బావికి ఏర్పాటుచేసిన విద్యుత్ మోటారు మరమ్మతులకు గురైంది. దీంతో, బాలసుబ్రమణి (44), సతీష్ (30) అక్కడకు చేరుకొని బావి నుంచి మోటరు బయటకు తీసి మరమ్మతులు పూర్తిచేశారు. మళ్లీ మోటరు బావిలోకి దించే క్రమంలో ఊహించని విధంగా విద్యుత్ తీగ తగలడంతో విద్యుదాఘాతానికి గురై ఇద్దరు ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పరమత్తి పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టంకు తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రేమించలేదని టీచర్ కిడ్నాప్

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): టీచర్‌ను కిడ్నాప్ చేసి లైంగిక వేధింపులకు పాల్పడిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. తిరునల్వేలి జిల్లాలో ఓ ప్రాంతానికి చెందిన రాజా ఓ సెల్‌ఫోన్ రిపేర్ షాప్ నిర్వహిస్తున్నాడు. ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్న 24 ఏళ్ల టీచర్‌తో రాజాకు పరిచయం ఏర్పడి తరచూ మాట్లాడుకొనేవారు. ఈ క్రమంలో, ఆ టీచర్ మరో ప్రైవేటు పాఠశాలకు వెళ్లిపోవడంతో ఆమె రాజాతో మాట్లాడడం తగ్గించింది. ఆమెతో మాట్లాడాలని రాజా యత్నించగా ఆమె నిరాకరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో, గురువారం సాయంత్రం ఆమె బస్టాండ్‌లో బస్సు కోసం వేచి ఉన్న సమయంలో కారులో వచ్చిన రాజా, తాను ఇంటికే వెళ్తున్నట్లు, తనతో రావాలని కోరాడు. అతను మాటలు నమ్మి ఆమె కారులో ఎక్కగా, అతను కన్నియాకుమరి వైపు కారు తిప్పడంతో అనుమానించిన ఆమె పెద్దగా కేకలు వేసింది. ఆ సమయంలో ఆమెపై రాజా లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. అతడి నుంచి తప్పించుకున్న ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కిడ్నాప్, లైంగిక వేధింపులు తదితర సెక్షన్లపై కేసు నమోదుచేసిన పోలీసులు రాజాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

కోయంబేడు మార్కెట్లో 145 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం

● దుకాణాలకు రూ.19వేల జరిమానా

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోయంబేడు హోల్‌సేల్ మార్కెట్లో ఆహార భద్రతా విభాగం, ఆరోగ్యశాఖ, గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ అధికారులు చేసిన ఆకస్మిక తనిఖీల్లో రాష్ట్రంలో నిషేధించిన 145 కిలోల ప్లాస్టిక్ స్వాధీనం చేసుకున్నారు. ప్లాస్టిక్ వినియోగించిన నేరానికి దుకాణాలకు రూ.19,500 జరిమానా విధించారు. కోయంబేడు మార్కెట్ ప్రాంగణంలో పండ్లు, పూలు, కూరగాయలు, బియ్యం, కందిపప్పు తదితర ధాన్యాలు విక్రయించే దుకాణాలు వేర్వేరుగా పనిచేస్తున్నాయి. ఈ దుకాణాల్లో ప్లాస్టిక్ సంచులు వినియోగించరాదని ప్రభుత్వం నిషేధం విధించింది. అయినా ఇటీవల కాలంలో ప్లాస్టిక్ వినియోగం చాలా వరకు పెరిగిందని ఆరోపణలున్నాయి. దీనిపై స్పందించిన పలు శాఖల అధికారులు గురువారం సాయంత్రం కోయంబేడు మార్కెట్లో ఆకస్మికతనిఖీలు చేపట్టారు. ఇందులో మూడు దుకాణాల నుంచి 145 కిలోల ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా ప్లాస్టిక్ బ్యాగులు విక్రయించిన ఆరు దుకాణాల నుంచి జరిమానా వసూలుచేశారు. నిషేధించిన ప్లాస్టిక్ వస్తువులు ఇకపై కూడా విక్రయిస్తే సంబంధిత దుకాణాలకు సీలు వేయనున్నట్లు అధికారులు హెచ్చరించారు.

మాదకద్రవ్యాల విక్రయం

● సేలంలో 13 మంది అరెస్టు



పోలీసుల అదుపులో నిందితులు

చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సేలం పరిసర ప్రాంతాల్లో నిషేధిత మత్తుమందు, మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్న 13 మందిని పోలీసులు అరెస్టు చేశారు. సేలం కిచ్చిపాళయం కస్తూరి బాయ్ వీధి, కురింజినగర్ హౌసింగ్ బోర్డు కాలనీ ప్రాంతాల్లో సీఐ కుమార్ నాయకత్వంలో ప్రత్యేక దళం పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేసి 13మందిని అరెస్టు చేశారు. వారి నుంచి 800లకు పైగా మత్తుమాత్రలు, మత్తు ఇంజెక్షన్లు, రెండు బైకులు స్వాధీనం చేసుకున్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం కేసులో ఐదుగురికి జైలుశిక్ష

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడిన కార్మికుడికి యావజ్జీవం, మరో నలుగురికి తలా 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ కడలూరు పోక్సో కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. కడలూరు జిల్లా కాట్టుమన్నార్‌కోయిల్‌కు చెందిన బాలు (53), వినాయగం (55), రామలింగం (60), వేల్‌మురుగన్ (33), వీరాస్వామి (34) మల్లె తోటలో పనికి వెళ్లారు. అక్కడ దివ్యాంగ మైనర్ బాలిక ఒంటరిగా ఉండడం చూసి ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. 2019లో జరిగిన ఈ అఘాయిత్యంపై కేసు నమోదుచేసిన పోలీసులు, నిందితులను పోక్సో చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో, కడలూరు పోక్సో కోర్టు వీరాస్వామికి యావజ్జీవం, మిగతా నలుగురికి తలా 20 ఏళ్ల జైలుశిక్ష విధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

కొడనాడు కేసులో 245 మంది సాక్షుల విచారణ

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): కొడనాడు కేసులో ఇప్పటివరకు 245 మంది సాక్షులను విచారించినట్లు ప్రభుత్వం తరఫున కోర్టుకు తెలియజేశారు. కొడనాడు హత్య, దోపిడీ కేసు విచారణ నీలగిరి జిల్లా ఊటీలోని జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టులో జరుగుతోంది. ఏడాదిన్నరకు పైగా ఈ కేసును సీబీసీఐడీ విచారిస్తున్న నేపథ్యంలో, ఇప్పటివరకు 245 మంది సాక్ష్యులను విచారించినట్లు శుక్రవారం జరిగిన విచారణలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. అలాగే, ఈ కేసుకు సంబంధించిన ముఖ్యమైన నిందితుడు డ్రైవర్ కనకరాజ్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నేపథ్యంలో, అతడితో విదేశాల నుంచి మాట్లాడిన వ్యక్తి ఎవరు? అనే విషయం తెలుసుకొనేందుకు ఇంటర్‌పోల్ సహాయం కోరామని, ఇప్పటివరకు వారి నుంచి ఎలాంటి సమాచారం లేదని, ఈ విషయమై ఇంటర్‌పోల్‌కు రిమైండింగ్ లెటర్ పంపుతున్నట్లు కోర్టులో సీబీసీఐడీ తెలియజేసింది.

పెద్ద హీరోల చిత్రాలను చూడలేకపోతున్నాం

● వనితా విజయకుమార్

తమిళ చిత్రజ్యోతి

తమిళ చిత్రపరిశ్రమలో పెద్ద హీరోలు నటించే చిత్రాలను చూడలేకపోతున్నామని సినీ నటి వనితా విజయకుమార్ వాపోతున్నారు. రామ్ ఎంట ర్‌టైన్మెంట్ పతాకంపై ప్రకాష్ ఎస్‌వీ నిర్మించిన చిత్రం 'డెక్స్‌టర్'. రాజీవ్ గోవింద్ పిళ్లై, అభిషేక్, జోసెఫ్ జార్జ్, యుక్తా పెర్వి, సితార విజయన్, హరీష్ పేరడి, తదితరులు నటించారు. రచన, దర్శకత్వం సూరియన్ జి. త్వరలోనే విడుదలకు సిద్ధమైన ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ వేడుకకు అతిథులుగా కోలీవుడ్ దర్శకుల సంఘం అధ్యక్షుడు ఆర్.వి.ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి పేరరసు, సీనియర్ నిర్మాత, నటుడు కె.రాజన్, సీనియర్ నటి వనితా విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇందులో వనిత మాట్లాడుతూ, 'చిత్ర పరిశ్రమలో చిన్నాపెద్దా సినిమా అనే తేడా లేదు. అన్ని చిత్రాలు ఒక్కటే. ఇపుడు పెద్ద హీరోలు నటించే సినిమాలను చూడలేకపోతున్నాం. అశ్లీలం అధికంగా ఉంటోంది. పెద్ద చిత్రాలతో పోల్చితే చిన్న సినిమాలే భారీ విజయాన్ని సొంతం చేసుకుంటున్నాయి' అని అన్నారు. ఆర్వీ ఉదయకుమార్ మాట్లాడుతూ, 'మూడు కెమెరాలతో షూట్ చేసేవారు పెద్ద దర్శకులు అని హీరోలు భావిస్తున్నారు. కంటెంట్ ఉన్న వారే గొప్ప దర్శకుడు. గత కొంతకాలంగా పెద్ద చిత్రాలను అలా నిర్మిస్తున్నారు. అందుకే చిన్న సినిమాలు ఘన విజయం సాధిస్తున్నాయి. చిన్న బడ్జెట్ సినిమాలను రక్షించాల్సింది మీడియానే. గేయ రచయితలు రాసిన పాట హీరో విజయ్ రాజకీయ ప్రస్థానానికి దోహదపడిందన్నారు. పేరరసు మాట్లాడుతూ, 'ఈ మధ్యకాలంలో చిన్న చిత్రాలైన 'లబ్బర్ పందు', 'కుడుంబస్థన్' వంటి పలు చిత్రాలు ఘన విజయం సాధించాయి. కానీ, శృంగార డోస్ అధికంగా ఉన్న 'ఫైర్' మూవీ మాత్రం ప్రతి ఒక్కరూ మాట్లాడుతున్నారు. ఒక సినిమాలో ఏదో ఒక సబ్జెక్ట్ ఉండాలి. అపుడే ప్రేక్షకుడు థియేటర్‌కు వస్తారు' అని పేర్కొన్నారు.



'డెక్స్‌టర్' ఆడియో రిలీజ్ వేడుక

ఏఐ - వీఎఫ్ఎక్స్ టెక్నాలజీదే భవిష్యత్తు



● ఆర్కే సెల్వమణి

చిత్రపరిశ్రమలో భవిషత్ అంతా కృత్రిమమేథ (ఏఐ), వీఎఫ్ఎక్స్ టెక్నాలజీదే అని ప్రముఖ దర్శకుడు, ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కె సెల్వమణి అన్నారు. డిజిటల్ ఇంటర్‌మీడియా విజువల్ ఎఫెక్ట్స్ అసోసియేషన్ (డిఐవీఏఏ - దివా) క్రాఫ్ట్‌గా గుర్తించాలని కోరుతూ నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆర్కే సెల్వమణి పాల్గొని మాట్లాడుతూ, 'నేను దర్శకత్వం వహించే కాలంలో శారీరక శ్రమతో పాటు ఆర్థికంగా శ్రమించాల్సి ఉండేది. అందులో 48 శాతం మాత్రమే అనుకున్న రీతిలో ఫుటేజీ వచ్చేది. ఇపుడు సరికొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. 2025 నుంచి 2050 వరకు సినిమాను శాసించేది ఏఐ, వీఎఫ్ఎక్స్ మాత్రమే. ఏఐ, వీఎఫ్ఎక్స్ సాంకేతికనిపుణులకు ఒక యూనియన్ ఉండటం ఒక గొప్ప విషయం. మీలోని ప్రతిభ ప్రతి ఒక్కరికీ పంచండి. అపుడే మీరు సినిమాలో రాణించగలరు. మూడేళ్లపాటు ఈ యూనియన్‌ను సక్రమంగా నిర్వహిస్తే, ఆ తర్వాత ఫెఫ్సీలో చేరేందుకు అవకాశం కల్పిస్తాం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి 25వ క్రాఫ్ట్‌గా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు. దివా వైస్‌ప్రెసిడెంట్ కలరిస్ట్ ముత్తు మాట్లాడుతూ, 'చాలామందికీ కంప్యూటర్ గ్రాఫిక్స్, వీఎఫ్ఎక్స్ గురించి తెలిసివుంటుంది. కానీ డీఐ (డిజిటల్ ఇంటర్‌మీడియేట్) టెక్నాలజీ గురించి తెలియదు. నిర్మాత బడ్జెట్‌కు అనుగుణంగా విజువల్ ప్రాసెస్‌గా డీఐ ఉంటుంది. ఇలాంటి సాంకేతిక నిపుణులకు ఒక అసోసియేషన్ ఉండాలన్న ఏకైక లక్ష్యంతోనే దివాను ప్రారంభించాం' అని వెల్లడించారు.

అతీంద్రియ శక్తుల అన్వేషకుడిగా ఆది

● 28న 'శబ్దం' విడుదల



మీడియా సమావేశంలో ఆది, అరివళగన్

డైరెక్టర్ అరివళగన్ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'శబ్దం'.ఆది పినిశెట్టి అతీంద్రియ శక్తుల అన్వేషకుడిగా నటించారు. ఈ నెల 28న విడుదలకానుంది. 7జీ ఫిలిమ్స్ పతాకంపై 7జి శివ నిర్మాణంలో తెరకెక్కింది. లక్ష్మీ మేనన్ హీరోయిన్. 'ఈరమ్' వంటి ఓ విభిన్నమైన చిత్రాన్ని తెరకెక్కించిన అరివళగన్ ఈ సూపర్ నేచురల్ మూవీ రూపొందించారు. ఈ మూవీ ఆడియో, ట్రైలర్ తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో హీరో ఆది పినిశెట్టి మాట్లాడుతూ, 'సాధారణంగా ఉన్నత సాంకేతిక ప్రమాణాలతో వచ్చే చిత్రాన్ని హాలీవుడ్ మూవీలా ఉంటుందని కామెంట్స్ చేస్తుంటామని ఆ స్థాయిని మంచిన సినిమా 'శబ్దం'. అతీంద్రియ శక్తుల అన్వేషకుడిగా నటించాను. 'ఈరమ్' ఒక విభిన్నమైన మూవీ. 'శబ్దం' దానికంటే డిఫరెంట్ చిత్రం. సాధారణంగా హార్రర్ మూవీ అంటేనే ఒక విధంగా చూస్తున్నారు. కానీ, 'శబ్దం' హార్రర్ మూవీలకు భిన్నం. 'ఈరమ్' చిత్రాన్ని ఒక వైవిధ్యభరితమైన చిత్రంగా రూపొందించిన దర్శకుడు అరివళగన్.. అంతకంటే వైవిధ్య భరితంగా, హాలీవుడ్ సినిమా కంటే అద్భుతంగా ఉంటుంది' అన్నారు.


7న 'నిరమ్ మారుమ్ ఉలగిల్' రిలీజ్

భారతీరాజా, నట్టి నటరాజ్, రియో రాజ్, శాండి మాస్టర్ నటించిన చిత్రం 'నిరమ్ మారుమ్ ఉలగిల్' మూవీ వచ్చే నెల 7వ తేదీన విడుదల చేయనున్నారు. దీనిని పురస్కరించుకుని నగరంలో తాజాగా ఈ చిత్ర ఆడియో, ట్రైలర్ రిలీజ్ చేశారు. సిగ్నేచర్ ప్రొడక్షన్స్, జీఎస్ సినిమా ఇంటర్నేషనల్ సంయుక్తంగా నిర్మించారు. బ్రిట్టో జేబీ ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఇతర పాత్రల్లో విజీ చంద్రశేఖర్, లవ్లీన్ చంద్రశేఖర్, నివాస్ ఆదిత్యన్, సల్మా, సురేష్ మేనన్, షైన్ గోపి, వడివుక్కరసి, విఘ్నేష్ కాంత్, రిషికాంత్, కనిక, ఆదిరా, ఆవ్వ అరివుమణి, తులసి, ఐరా కృష్ణన్, లిజి ఆంటనీ, నమో నారాయణన్, సురేష్ చక్రవర్తి, ఏగన్, విజిత్, జీవా సుబ్రమణియం, దిండిగల్ నారాయణన్ తదితరులు నటించారు. ఆడియో రిలీజ్ వేడుకలో దర్శకుడు బ్రిట్టో మాట్లాడుతూ, 'ఇది నా తొలి చిత్రం. పలు చిత్రాల్లో నటించినప్పటికీ. దర్శకత్వం వహించాలన్న బలమైన కోరిక ఉండేది. ఇందుకోసం అనేక కథలు రాశాను. ఇందులో అన్ని అంశాలు మిళితమైవున్నాయి. మదర్ సెంటిమెంట్‌తో గతంలో అనేక చిత్రాలు వచ్చాయి. కానీ, ఇందులో ప్రత్యేక కత ఉంది. ప్రతి ఒక్కరికీ నచ్చుతుందన్నారు. హీరో రియోరాజ్ మాట్లాడుతూ, 'నా స్నేహితుడు దర్శకుడు బ్రిట్టో దర్శకత్వం వహించిన తొలి చిత్రంలో నేను నటించడం ఆనందంగా, గర్వంగా ఉంది. నేను నటించిన తొలి మ్యూజిక్ ఆల్బమ్‌కు బ్రిట్టో దర్శకుడు' అన్నారు.



'నిరమ్ మారుమ్ ఉలగిల్' ఆడియో రిలీజ్ దృశ్యం

అగర్వాల్ ఐ హాస్పిటల్ బ్రాండ్ అంబాసిడర్‌గా సచిన్



చెన్నై, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయిలో నేత్ర వైద్యం, చికిత్స అందిస్తున్న డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్ బ్రాండ్ అంబాసిడర్‌గా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ అమర్ అగర్వాల్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆరు దశాబ్దాలకు పైగా నేత్ర వైద్య సేవలందిస్తూ దేశవిదేశాల్లో 223 ఆస్పత్రులు కలిగిన తమ సంస్థకు మేటి క్రీడాకారుడు సచిన్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించనుండటం తమకెంతో గర్వకారణంగా ఉందని ఆయన తెలిపారు.

మాతృభాష కనుమరుగుతో కోల్పోనున్న గుర్తింపు

● వీఐటీ ఉపాధ్యక్షుడు డాక్టర్ జీవీ సెల్వం



ముఖ్యఅతిథి మియాల కెంజికి జ్ఞాపిక అందజేస్తున్న జీవీ సెల్వం

పెరంబూర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మాతృభాషను ప్రతి ఒక్కరు పరిరక్షించుకోవాలని, మాతృభాష కనుమరుగయితే గుర్తింపు కూడా కోల్పోతామన్న విషయం గుర్తుంచుకోవాలని వీఐటీ యూనివర్శిటీ ఉపాధ్యక్షులు డా.జీవీ సెల్వం పేర్కొన్నారు. వీఐటీ వర్సిటీ చెన్నై క్యాంపస్‌లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వర్సిటీ ఉపాధ్యక్షులు జీవీ సెల్వం అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా జపాన్ దౌత్య కార్యాలయ ఉప దౌత్యాధికారి మియాట కెంజి హాజరయ్యారు. కార్యక్రమంలో కేరళ, కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, ఒడిశా, గుజరాత్, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన విద్యార్థులు తమ మాతృభాషలో మాట్లాడడంతో పాటు మాతృభాష ప్రాధాన్యత వివరించారు. కార్యక్రమంలో డా.జీవీ సెల్వం మాట్లాడుతూ... ఏ దేశ ప్రజలు మాతృభాషలో మాట్లాడతారో, ఆ దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ముఖ్యఅతిథి మియాట కెంజీ మాట్లాడుతూ... భావ వ్యక్తీకరణ, సమాచారం అందిపుచ్చుకొనేందుకు మాతృభాష కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ ప్రొ ఛాన్సలర్ డా.టి.త్యాగరాజన్, అడిషినల్ రిజిస్ట్రార్ డా.వీకే మనోహరన్ తదితరులు పాల్గొన్నారు.



చెన్నై కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, సిబ్బంది చేత మాతృభాషా దినోత్సవ ప్రతిజ్ఞ చేయిస్తున్న డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్



సీఎం స్టాలిన్ ముందస్తు జన్మదిన వేడుకల్లో భాగంగా కొళత్తూరు జీకేఎం కాలనీ జంబులింగం ప్రధాన రహదారిలో పేదలకు ఉచిత అల్పాహారం పంపిణీ చేస్తున్న మంత్రి శేఖర్‌బాబు, మేయర్ ప్రియ



భరత నాట్యంలో వివిధ భంగిమలను ప్రదర్శిస్తున్న అమృత

నేర్చుకోవాలనే తపన ఉంటే ఎన్ని విద్యలైనా కరతలామలకం అవుతాయి. ఎంతటి జ్ఞానం అయినా సంపాదించుకోవచ్చు. ఎల్.కె.జి. చదివే సమయంలో తల్లి నాట్య శిక్షణలో చేర్పించింది. ఊహ తెలియని వయసులో నాట్యానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం నాట్య ప్రదర్శనలనిస్తూ, నాట్యం నేర్పే స్థాయికి ఎదిగింది ఆమె. భరతనాట్య కళాకారిణిగా మాత్రమే కాకుండా శాస్త్రీయ సంగీత గాయనిగా, వైలనిస్టుగా.. ఇన్ని కళలను తనలో ఇముడ్చుకున్న ఆమె టి.అమృతవర్షిణి. ఆమె కళా జీవన ప్రస్థానం ఈనాటి 'తరుణి'లో...

- వేళచ్చేరి



వయోలిన్‌పై రాగాలు..

బహుముఖ ప్రజ్ఞాశాలి వాద్య, నాట్య, గాత్రాల్లో మేటి

● భరతనాట్య కళాకారిణి అమృతవర్షిణి

తరుణి

అమృతవర్షిణి జన్మించింది ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో అయినా పెరిగినదంతా చెన్నై నగరంలోనే. ఆమె తల్లి శారద గృహిణి. తండ్రి శశిధర్ ఫ్లూట్ వాయిద్య నిపుణుడు. 'కలైమామణి' అవార్డు గ్రహీత. అమృతవర్షిణి కళాక్షేత్ర ఫౌండేషన్‌లోని సీబీఎస్‌ఈ స్కూలులో 12వ తరగతి వరకు చదివి, తరువాత టి.నగర్‌లోని జైన్ కాలేజీలో బి.కామ్ పూర్తి చేశారు.

నాట్య ప్రస్థానం...

నాలుగేళ్ల ప్రాయంలోనే భరత నాట్యం నేర్చుకోవడం ప్రారంభించిన అమృతవర్షిణి ప్రారంభంలో కె.మోహనన్ వద్ద శిక్షణ పొందింది. తరువాత కళాక్షేత్ర ఫౌండేషన్‌లో ఏడేళ్ల పాటు నేర్చుకున్న తరువాత పది సంవత్సరాలుగా డా.అంజనా ఆనంద్ వద్ద నాట్య శిక్షణ తీసుకుంటోంది.. 2014లో అరంగేట్రం చేసాక వరసిద్ధి వినాయక దేవాలయంలో సోలోగా నాట్య ప్రదర్శన ఇచ్చి అందరి మెప్పుపొందింది. చెన్నైలోని కృష్ణ గాన సభ, సుముఖి రాజశేఖర మెమోరియల్ ఫౌండేషన్ ఇలా ఎన్నో సభల్లో భరతనాట్యం ప్రదర్శించింది. 'ప్రయత్నమ్' సంస్థ నిర్వహించిన 'యత్నమ్' పరీక్షలో ఉన్నత స్థానం సంపాదించింది. అంజనా ఆనంద్ 'ఊలా' అనే నాట్య, నాటక సంస్థలో భాగమై పలు ప్రదర్శనలిచ్చింది. అమృతవర్షిణి దూరదర్శన్, పొదిగైలో బి.గ్రేడ్ ఆర్టిస్టుగా సేవలందిస్తున్నది. విరామ సమయంలో ఇంట్లో ఎంతో మంది విద్యార్థులకు నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు.



శాస్త్రీయ సంగీతం ఆలపిస్తూ...

గాత్ర కళాకారిణిగా...

అమృతకు బాల్యం నుండి పాటలపై మక్కువ. స్వయంకృషితో నేర్చుకొని స్కూలు ప్రోగ్రామ్స్‌లో పాటలు పాడి బహుమతులు గెలుచుకొనేది. పాటలపై ఆమె ఆసక్తిని గమనించిన తల్లి ఆమెకు శాస్త్రీయ సంగీతం నేర్పించాలని భావించారు. కళాక్షేత్రలోని రుక్మిణీదేవి కాలేజి ఆఫ్ ఫైన్ ఆర్ట్స్‌లో గాత్ర శాస్త్రీయ సంగీతంలో డిప్లొమా చేసింది అమృత. 2021వ సంవత్సరంలో డిప్లొమాలో అన్ని సబ్జెక్టుల్లో ఉన్నత స్థాయి అందుకున్న ఆమె ఆ సంవత్సరం 'బెస్ట్ స్టూడెంట్'గా నిల్చింది. తండ్రి శిక్షణలో సంగీతంలో మెళుకువలు గ్రహించి పిల్లలకు 'మ్యూజిక్' నేర్పించే స్థాయికి ఎదిగింది. చెన్నైలో ఎన్నో సభల్లో కచేరీలు చేసి అనుభవం సంపాదించారు..



భర్త దినేశ్‌కుమార్‌తో...

వాయులీన విద్వాంసురాలిగా...

నాట్య, సంగీతాలల్లోనే కాకుండ వాద్య సంగీతంలో కూడా అడుగుపెట్టింది అమృత. కొంతమంది కళాక్షేత్ర విద్యార్థులు వయోలిన్ వాయించడం విన్న అమృతకు అదే ప్రేరణ అయింది. 3వ తరగతి చదివే సమయంలోనే వయోలిన్ వాద్యాన్ని కూడా ప్రారంభించింది. పదేళ్ల పాటు వయోలిన్ వాయిద్యంలో శిక్షణ తీసుకొని తను గురువుగా బోధించగలిగే అర్హత సంపాదించారు.

ఉద్యోగం....

కోయంబత్తూర్‌లోని 'ఈషా' ఫౌండేషన్‌లో మ్యూజిక్ టీచర్‌గా ఏడాది పాటు బాధ్యతలు నిర్వహించింది. ప్రస్తుతం ఒక మ్యూజిక్ స్కూలులో నాలుగేళ్లుగా విద్యార్థులకు శాస్త్రీయ సంగీతం నేర్పుతూ.. అంతేకాకుండా ఇంట్లో కూడ నాట్య, సంగీత, వాద్య తరగతులను నిర్వహిస్తూ ఆన్‌లైన్‌లోను శిక్షణ ఇస్తున్నారు అమృత..

అవార్డులు: 'ప్రయత్నం' సంస్థ నుంచి 'భరత కళామణి' అవార్డు అందుకున్న అమృత. కళాక్షేత్ర నుంచి 'బెస్ట్ స్టూడెంట్' పురస్కారం తీసుకున్నారు.

"చదువుకుంటూనే కళలను కూడా నేర్చుకోవచ్చు. తల్లిదండ్రులు చదువు పాడవుతుందని మధ్యలోనే పిల్లలు నేర్చుకుంటున్న కళకు స్వస్తి పలుకుతారు. అలా చేయనక్కరలేదు. కళలు ఒత్తిడిని తగ్గిస్తాయి. మనసుకు సాంత్వన కలిగిస్తాయి. చదువుకుంటూనే కళలలో రాణించవచ్చు". అని అమృత తన అనుభవాలను తరుణితో పంచుకున్నారు.

కుటుంబ నేపథ్యం...

అమృత భర్త దినేశ్‌కుమార్, ఐటి ఉద్యోగి. అమృత నృత్య కార్యక్రమాలకు వయోలిన్‌పై వాద్య సహకారమందిస్తుంటారు. కొన్ని సార్లు గాత్ర సహకారం కూడా అందిస్తుంటారు. దైవదత్తమైన కళల గురించి మాట్లాడుతూ... ' సంగీతం, వయొలిన్, నాట్యం మూడూ ముఖ్యమైనవే. అన్నిటిని సమానంగా చూస్తాను. ఒక దాని కోసం మరొకటి వదులుకోలేను అన్నారు అమృతవర్షిణి. భవిష్యత్తులో తన కళా ప్రదర్శనలను కొనసాగిస్తూనే సంగీత, నృత్య పాఠశాలను నడపాలనే కోరికను అమృత వెల్లడించారు.

పిల్లలకు తమిళంలో పేర్లు పెట్టండి

● మంత్రి స్వామినాథన్



తమిళ సాహితీవేత్తలకు పురస్కారాలు అందిస్తున్న మంత్రి స్వామినాథన్

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పుట్టబోయే పిల్లలకు తమిళంలో నామకరణం చేయాలని రాష్ట్ర తమిళాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎంపీ స్వామినాథన్ పిలుపునిచ్చారు. కోవైలో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక సదస్సులో లండన్, సింగపూర్, ఫ్రాన్స్ తదితర దేశాలకు చెందిన తమిళ సాహితీవేత్తలకు మంత్రి స్వామినాథన్ ప్రపంచ తమిళ సాహితీ పురస్కారాలు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో ప్రతిపక్ష నేతగా వ్యవహరించిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి తమిళ భాషకు సెమ్మొళి స్థాయి తీసుకొచ్చారని కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన హిందీ వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్న తాను 45 రోజులు జైలులో గడిపానని, అందువల్లే తనకు డీఎంకేలో మంచి గుర్తింపు వచ్చిందన్నారు. మాతృభాష ను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరు పాటుపడాలని, పుట్టే పిల్లలకు తమిళంలో నామకరణం చేయాలని మంత్రి సూచించారు. ఈ సదస్సులో పురావస్తు పరిశోధక శాఖ డైరెక్టర్ అవ్వై అరుళ్, కోవై మేయర్ రంగనాయకి సహా పలువురు పాల్గొన్నారు.



కాంచీపురం జిల్లా పనయూరు వద్ద చలనచిత్రకళాకారుల ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన 90 ఎకరాల లీజు గడువు పునరుద్ధరిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులిచ్చినందుకు ఉప ముఖ్యమంత్రి ఉదయనిధికి ధన్యవాదాలు తెలుపుతున్న నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, పెప్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి తదితరులు



విజేతలతో రవీంద్రకుమార్‌రెడ్డి, అన్నపూర్ణ, కమల తదితరులు

జాతీయ పారా అథ్లెటిక్స్‌లో నేత్ర విద్యాలయ క్రీడాకారుల సత్తా

● జెట్ చెన్నై నిర్వాహకుల అభినందన

ప్యారీస్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరియమేడులోని నెహ్రూ స్టేడియంలో రాష్ట్ర క్రీడాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఛాంపియన్ షిప్ పోటీల్లో త్రిదండి చిన్నజీయర్ స్వామి నిర్వహిస్తున్న నేత్ర విద్యాలయకు చెందిన క్రీడాకారులు సత్తా చాటి స్వర్ణ, రజత, కాంస్య పతకాలను సొంతం చేసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఈ నెల 18న ప్రారంభించిన ఈ పోటీలు బుధవారం వరకు జరిగాయి. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు పాల్గొని పతకాలను కైవసం చేసుకున్నారు. పరుగు పందెం (ఉమెన్స్) కేటగిరీ-టీ11లో కె.లలిత (విజయనగరం) రజత, రవన్ని (విశాఖపట్టణం) వెండి పతకాలు సాధించారు. విజేతలను, నేత్ర విద్యాలయ ప్రిన్సిపాల్ శిరీష, ఇద్దరు కోచ్‌లను జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (జెట్) చెన్నై విభాగం అధ్యక్షులు పి.రవీంద్రకుమార్ రెడ్డి, సభ్యులు అన్నపూర్ణ, మహాలక్ష్మి, గజలక్ష్మి, కో-ఆర్డినేటర్ కమల, పద్మలత తదితరులు అభినందించారు.



శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని వస్తున్న ఇండియన్ బ్యాంక్ ఎండీ, సీఈవో బినోద్ కుమార్ - సంగీత దర్శకుడు తమన్ - గాయకులు అద్వితీయ, శృతి రంజని

శ్రీవారికి మినీ ట్రక్కు విరాళం

తిరుమల శ్రీవారికి శుక్రవారం అశోక్ లేలాండ్ కంపెనీ బిజినెస్ హెడ్ విప్లవ్ షా రూ.6.60 లక్షల విలువైన సాథీ మినీ ట్రక్కును విరాళంగా అందజేశారు. శ్రీవారి ఆలయం ముందు వాహనానికి ప్రత్యేక పూజలు నిర్వహించాక వాహన పత్రాలు, తాళాలను ఆలయ ఏఈవో మోహన్‌రాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో అశోక్ లేలాండ్ సేల్స్ హెడ్ శ్రీకాంత్ రాజ తదితరులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



వాహన పత్రాలు, తాళాలను ఏఈవోకు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 23 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచివున్నారు.

బుధవారం నాటి హుండీ ఆదాయం: రూ.4.24 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,776

తలనీలాలు సమర్పించినవారు: 22,386





హేమవతి - హేమలత



చరణశ్రీ, చరణ్యశ్రీ



దీక్షిత, దర్శిల్ (హైదరాబాదు)



హితీష్, హిమ్నేష్

కవలలు.. కలుస్తున్నారిలా..

ఒకే పోలికతో ఉన్న ఇద్దరిని చూడగానే ముచ్చటేస్తుంది. అలాంటిది దాదాపుగా 70మంది కవలలు ఒకే వేదికపై కలుస్తున్నారంటే ఇంతకంటే ఆనందమేముంటుంది. జాతీయ కవలల దినోత్సవం పురస్కరించుకుని శనివారం వీరందరి సెలబ్రేషన్స్‌కు నగరంలోని వేమన విజ్ఞాన కేంద్రం వేదిక కానుంది. ఉదయం 10గంటలకు కేక్‌కటింగ్‌తో కవలల సందడి మొదలవుతుంది. ర్యాంప్ వాక్, డ్యాన్సు, సింగింగ్ లాంటి వివిధ పోటీల్లో వీరంతా ఉత్సాహంగా పాల్గొంటున్నారు.. ప్రతిభ కనబరిచిన కవలలకు బహుమతులు కూడా ప్రదానం కూడా ఉంటుంది. కొన్నేళ్లుగా ఇలా వేడుక నిర్వహణకు బాధ్యత వహిస్తున్నారు నగరానికి చెందిన హేమావతి, హేమలతలు. వీరిద్దరూ కూడా కవలలేనండోయ్.. ఈ సందర్భంగా వారు ఆంధ్రజ్యోతితో కవలల కలయిక వెనుక ఉన్న ప్రయత్నాన్ని వివరించారిలా..

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



వీరేంద్ర, విజయేంద్ర (బద్వేల్)

- వేదిక కానున్న వేమన విజ్ఞానకేంద్రం
- నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం



హస్సేన్, హుస్సేన్ (పీలేరు)

తొలిసారి వేడుకలకు మేమిద్దరమే...

తిరుపతి రాయలచెరువురోడ్డు యాదవకాలనీ మా స్వస్థలం. నాన్న సహదేవ కారుడ్రైవర్, అమ్మ గృహిణి. 7వ తరగతిలో చదువుతుండగా కవలల దినోత్సవం రోజున ప్రేయర్‌లో 2వ తరగతి విద్యార్థులు రామ్‌లక్ష్మణ్‌లను పిలిచారు. టీచర్స్ శుభాకాంక్షలు తెలిపారు. తరువాత మాఇద్దరికీ కూడా శుభకాంక్షలు తెలిపారు. అప్పుడే తెలిసింది కవలలకు ప్రత్యేక రోజు ఉందని. వచ్చే ఏడాది నుంచి సంబరాలు చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాం. అమ్మానాన్నలకు చెబితే సరే అన్నారు. 2007లో తొలిసారిగా కవలల దినోత్సవాన్ని చేసుకున్నాం. అప్పుడు మాతో నాలుగు జంటల కవలలు కలిశారు. ఆ తరువాత ఏటా ట్విన్స్ రావడం పెరిగారు. 2018లో 50మందితో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. కరోనా నేపథ్యంలో 2020, 2021లో వేడుకలు జరుపుకోలేదు. 2022, 2023, 2024లలో 70జంటలకు తగ్గకుండా కవలల దినోత్సవం జరుపుకొంటున్నాం. కుటుంబంలా ఏర్పడుతున్నాం. ఏటా మాతో పాటు మరో నలుగురు విరాళం అందిస్తున్నారు. ఎంబీఏ చదివిన మేము ప్రస్తుతం బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాం. వేడుక కోసం ఏటా రెండు రోజుల ముందుగా ఇంటికి వస్తాం. సంబరాలకు ఏర్పాట్లు చేస్తాం. తిరుపతిలో ఉంటున్న హితీష్, హిమ్నేష్, చరణశ్రీ, చరణ్యశ్రీ, తెలంగాణ గద్వాల్ నుంచి విజేంద్ర, వీరేంద్ర, పీలేరుకు చెందిన హస్సేన్, హుస్సేన్, హైదరాబాదుకు చెందిన దీక్షిత, దర్శిల్ కూడా ఆర్థిక సహకారమందిస్తున్నారు. ఈ ఏడాది శనివారం వేమనవిజ్ఞాన కేంద్రంలో సెలబ్రేషన్స్ చేసుకుంటున్నాం. తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, రేణిగుంట, శ్రీకాళహస్తి, నగరి, కడప, మదనపల్లి, కర్నూల్, హైదరాబాద్, బెంగళూరు, గద్వాల్ నుంచి కూడా ట్విన్స్ వస్తున్నారు. సేవా కార్యక్రమాలు చేయాలన్నదే మా ఆకాంక్ష. రక్తదాన, అన్నదాన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలి. పేద కవలలను ఆదుకోవాలి. వారి విద్య, వైద్యానికి చేయూత అందించాలనుకుంటున్నామని హేమావతి, హేమలత వివరించారు.



ప్రాచీన సంగమేశ్వర ఆలయం

స్వర్ణముఖి నదీ తీరాన వెలసిన సంగమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో ఆరాదిస్తారు. తమ కోరికలు తీర్చే దైవంగా విశ్వసిస్తారు. కోట మండలం గూడలిలో చోళరాజులు నిర్మించిన స్వామి ఆలయానికి విశేష చరిత్ర ఉంది. ఎప్పటిలా ఈ ఏడాదీ మహాశివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది.

- కోట, (ఆంధ్రజ్యోతి)

అటు సంగమయ్య.. ఇటు సోమయ్య

- గూడలి సంగమేశ్వరుడి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ఏర్పాట్లు

సంగమేశ్వరుడి ఆలయం వెనుక ఆసక్తికర ఇతిహాసముంది. ఆరవ శతాబ్దంలో అగస్త్య మహాముని కాశీ నుంచి కన్యాకుమారికి వెళ్తూ గూడలి వద్ద రాత్రిపూట బసచేశాడు. మర్నాడు ఉదయాన్నే స్వర్ణముఖినదిలో స్నానం చేస్తుండగా ప్రకృతి ప్రళయ గర్జన సృష్టించింది. వటవృక్షాలు సైతం నేలకొరిగిపోయాయి. స్నానానికి ముందు అగస్త్య మహాముని నరది ఒడ్డునపెట్టిన రుద్రాక్ష మాలలు చెక్కు చెదరలేదు. అంతేకాదు ఆ రుద్రాక్షమాలలన్నీ శివలింగ ఆకృతిలో కొలువుదీరాయి.. దీంతో విస్తుపోయిన మహాముని ఈ ప్రాంతంలో సాక్షాత్తూ పరమేశ్వరుడే ఉన్నాడంటూ నాటి చోళరాజుల్లో పెద్దవాడైన పెదపాండ్యభూపతిరాజుకు చెబుతాడు. వెంటనే భూపతిరాజు గూడలిలో స్వర్ణముఖినది తీరానా కామాక్షిదేవి సమేత సంగమేశ్వరుని ఆలయాన్ని నిర్మించారనిఐతిహ్యం ప్రచారంలో ఉంది. చోళరాజుల హయాంలోని విలువైన భూములను మాన్యంగా ఇచ్చారు. అప్పటి నుంచి సంగమేశ్వరుడి ఈ ప్రాంతంలో భక్తుల పూజలందుకుంటున్నాడు.



గూడలిలో సంగమేశ్వరుడు విగ్రహం

దేవదాయశాఖ పరిధిలో...

సంగమేశ్వరుడి ఆలయం ఇప్పుడు దేవదాయశాఖ పరిధిలోకి ఉంది. 14 ఎకరాల మాన్యం భూముల కౌలుతో ఏటా శివరాత్రి ఉత్సవాలు, ఏప్రిల్ మొదటివారంలో బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల ఆలయంలో అన్నదానానికి ప్రత్యేక గదుల నిర్మించాలని ప్రతిపాదించారు. కోనేరుకు స్థలం లేనందున పక్కనే ఉన్న స్వర్ణముఖినదిలో భక్తుల స్నానాలు చేసి సంగమయ్యకు మొక్కులుతీర్చుకుంటారు. నాటి రథమే నేటికీ చెక్కుచెదరకుండా స్వామి సేవలో తరిస్తోంది. కామాక్షి దేవి అమ్మవారికి ఇటీవ వెండిచీరను అలంకరించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాల నుంచే కాకుండా తమిళనాడు, కర్ణాటకల నుంచి కూడా భక్తులు వస్తుంటారు.

ఎలా చేరుకోవాలంటే..

నాయుడుపేటకు చేరుకుని కోట-నాయుడుపేట మార్గం మీదుగా 25 కిలోమీటర్లలోని గూడలికి రావాలి. నెల్లూరు నుంచి గూడూరు నుంచి రావాలనుకుంటే విద్యానగర్‌కు చేరుకొని 1.5 కిలోమీటర్లు నడిచి గాని, వాహనాల్లో గూడలి చేరుకోవచ్చు.

చేరువలో భీమయ్య ఆలయం

సంగమేశ్వరుని ఆలయానికి కొన్ని మీటర్ల దూరంలోనే గూడలి తిప్ప ఉంది. ఈ తిప్పపై పర్వతవర్ధిని సమేత భీమేశ్వర ఆలయముంది. ఈ ఆలయం కూడా 500 ఏళ్ల పైబడిన ఆలయంగా చెబుతుంటారు. తిప్పమీద భీమేశ్వరుడు, తిప్ప కింద సంగమేశ్వరుడు రెండు కళ్లతో తమను కాపాడుతారని ఇక్కడి తీర మండలాల ప్రజల నమ్మకం. ఈ రెండు ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.



రేస్ కార్ ఆవిష్కరణలో తమన్ తదితరులు

అంబరం సాంకేతిక సంబరం

- ఐఐటీలో అట్టహాసంగా తిరుత్సవ్ ఆరంభం



వేదికపై మాట్లాడుతున్న తమన్

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీలో తిరుత్సవ్-2025 అట్టహాసంగా ప్రారంభమైంది. టెక్నో కల్చరల్ ఫెస్ట్ తిరుత్సవ్ పేరుతో మూడు రోజులపాటు జరిగే ఈ వేడుక శుక్రవారం ప్రారంభమైంది. సాంకేతిక నైపుణ్యాల ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఐఐటీ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలతో, 3డీ లైట్లతో తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా హాజరైన సంగీత దర్శకుడు ఎస్ఎస్ తమన్ జ్యోతి ప్రజ్వలన చేసి సాంస్కృతిక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అంతకుముందు ఐఐటీ విద్యార్థుల ఆధ్వర్యంలో సాంకేతిక వర్క్‌షాప్‌లు, ఎగ్జిబిషన్ జరిగాయి. వినూత్న ఆవిష్కరణలపై చర్చించారు. సాంకేతిక అంశాలను పోటాపోటీగా ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై
కల్యాణ వెంకన్న కటాక్షం



చంద్రగిరి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహనాలపై స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పూజల అనంతరం ఉత్సవర్లను రాజమన్నార్ అవతారంలో అలంకరించి కల్పవృక్ష వాహనంపై అధిష్ఠించారు. మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం కంకణ భట్టర్ నారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్నపన తిరుమంజనం(పవిత్రస్నానం), సాయంత్రం ఊంజల్‌సేవ జరిగింది. రాత్రి కాళియమర్దిని అలంకారంలో సర్వభూపాల వాహనంపై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు రాజ్‌కుమార్, రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్స్‌పెక్టర్లు మునిమార్‌రెడ్డి, ధనశేఖర్, అర్చకులు బాలాజీరంగాచార్యులు, పార్థసారది, నారాయణాచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు. శనివారం రాత్రి గరుడ వాహనసేవ జరగనుంది.



కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై స్వామివారు







లోకలైసర్ యాంటెన్నాలు

విమానాశ్రయంలో నూతనంగా అమర్చిన డిస్టాన్స్ మెజరింగ్ ఎక్విప్మెంట్ - విమానాశ్రయం రన్‌వేలో అమర్చిన గ్లైడ్ పాత్

తిరుపతి విమానాశ్రయానికి
అధునాతన పరికరాలు

రేణిగుంట, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో అంతర్జాతీయ స్థాయి విమానాలు ల్యాండింగ్ అయ్యేందుకు రూ.153.16 కోట్లతో అధునాతన పరికరాలను ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఎంపీ గురుమూర్తి, ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యులు పాల్గొన్నారని ఎయిర్ పోర్టు డైరెక్టర్ శ్రీనివాసరావు మానే తెలిపారు.

డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్‌మెంట్: ప్రస్తుతమున్న రన్‌వేపై కేవలం 100విమానాలను ఆపరేటివ్ చేసే స్థాయి నుంచి200 విమానాల రాకపోకలను అధునాతన డిస్టెన్స్ మెజర్మెంట్ ఎక్విప్మెంట్‌ను తిరుపతి విమానాశ్రయంలో అమర్చారు. ఈ అధునాతన పరికరానికి రూ.5.61 కోట్లు వెచ్చించారు.

ఇన్‌స్టుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్): గతంలో రన్‌వేపై 700 మీటర్ల కెపాసిటీ ఉన్న ఇన్‌స్టుమెంటల్ ల్యాండింగ్ సిస్టం(ఐఎల్ఎస్)ను 1500 మీటర్లకు పెంచి అధునాతన పరికరాన్ని అమర్చారు. విమానాలు దిగే సమయంలో బ్యాలెన్స్ చేసుకుని రన్‌వే మధ్య గీతను గుర్తించి క్షేమంగా ల్యాండింగ్‌కు ఈ పరికరం సహకరిస్తుంది. వాతావరణం అనుకూలించని పరిస్థితుల్లోనూ ల్యాండింగ్‌కు సహకరిస్తుంది. ఈ పరికరం ధర రూ.4.4 కోట్లు.

బోయింగ్ విమానాల రాకపోకలకు సుగమం

రన్‌వేను 3810 మీటర్లతో విస్తరించడంతో బోయింగ్ 777, ఎయిర్ బస్ 330 వంటి పెద్దపెద్ద ఎయిర్‌క్రాఫ్ట్‌లు సురక్షితంగా ల్యాండింగ్ కావచ్చు. ప్రస్తుతం అమర్చిన లైటింగ్ కారణంగా రన్‌వేకు స్పష్టంగా కనిపిస్తుండడంతో క్షేమంగా ల్యాండయ్యేందుకు ఉపయోగపడుతుంది. ఈ రన్‌వే నిర్మాణానికి రూ.143.15కోట్లు వెచ్చించారు. వీటన్నింటినీ శుక్రవారం వర్చువల్ విధానంలో ఏఏఐ అధికారులు లాంచనంగా ప్రారంభించారు.

'వైష్ణవి' డెయిరీ ఎదుట కార్మికుల ధర్నా



పెళ్లకూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): పెళకూరు మండలం పునబాక గ్రామంలో మూసేసిన శ్రీ వైష్ణవి డెయిరీ ఎదుట శుక్రవారం కార్మికులు ధర్నా చేపట్టారు. వైసీపీ ప్రభుత్వంలో తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యి కల్తీ వ్యవహారం నేపథ్యంలో ఈ వైష్ణవి పరిశ్రమ మూతపడింది. దీనిపై అధికారులు పలు ధపాలుగా ఈ పరిశ్రమలో తనిఖీలు చేశారు. దీంతో పరిశ్రమ యాజమాన్యం గుట్టు చప్పుడు కాకుండా కంపెనీని మూతవేసి ఆచూకీ లేకుండా వెళ్లారు. దీంతో కార్మికులు తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కంపెనీని మూతవేశారని అయినా కొంతకాలం వేచి చూసి తమకు రావాల్సిన గ్రాట్యుటీతో పాటు ఇతర అలవెన్సులు ఇవ్వాలని కంపెనీ ఎదుట టెంటు వేసుకొని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా కంపెనీకి సంబంధించిన ప్రతినిధులు ఆందోళన చేస్తున్న కార్మికుల వద్దకు చేరుకొని నెలరోజుల్లో కార్మికులకు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

గుర్తు తెలియని వ్యక్తి దారుణహత్య

- ఇసుకలో పూడ్చిపెట్టిన హంతకులు
- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తిని హతమార్చి ఇసుకలో పూడ్చిపెట్టిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది. తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపిన వివరాలు... తొట్టంబేడు మండలం శివనాథపురం పరిధిలోని రాజీవ్‌నగర్‌లో పలు నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. శుక్రవారం సుగుణ అనే మహిళ రాజీవ్‌నగర్‌లో ఇంటి నిర్మాణ పనులు చేస్తుండగా ఇసుక తగ్గింది. దీంతో సమీపంలోని అసంపూర్తిగా ఉన్న ఓ ఇంట్లో ఇసుకను తీసుకునేందుకు మరో మహిళను వెంటబెట్టుకుని వెళ్లింది. అక్కడ ఇంట్లో ఇసుకపై ఉన్న సిమెంటు ఇటుకలను పక్కకు తీయగానే మృతదేహం కాలు బయటపడింది. బిత్తర పోయిన వీరిద్దరూ తొట్టంబేడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ తిమ్మయ్య, ఎస్ఐ ఈశ్వరయ్య సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇసుకలోని మృతదేహాన్ని వెలికి తీశారు. సుమారు ఒకటిన్నర నెల క్రితం పూడ్చినట్లు అంచనా వేశారు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి వైద్యబృందంతో ఘటనా స్థలంలో పోస్టుమార్టం పూర్తి చేశారు. మృతదేహం వెలుగు చూసిన ఇంటి స్థలం ఎవరిది అన్నది ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఈశ్వరయ్య తెలిపారు.